# దేవుడెరిగిన నిజం !

జిల్లా పరిషత్ హైస్కూలుహెడ్మాస్టరు హనుమాన్లు సస్పెండయినాడనే విషయం వూరంతా గుప్పుమంది.

ఊళ్లో ఎవరినోట విన్నా అయ్యవారి సస్పెంన్షన్ విషయం గురించే? అసలు కారణం ఎవరికీ తెలియక పోవటంతో తలా ఒక రకంగా వూహిస్తూ ప్రచారం చేస్తున్నారు.

నిజానికి హనుమాన్లు అంటేనిప్పు! ఆంజనేయోపాసకుడు. వైవాహికజీవితం అక్కర్లేదని నిర్ణయించుకుని బ్రహ్మచారిగానే వుంటున్న పెద్ద మనిషి!

ఏవూరు బదిలీ అయినా స్వయం పాకమే! మడి ఆచారం వున్నవాడు కావటంతో హోటల్లో కూడా భోజనం చేసే అలవాటు లేదు. కాఫీ తాగే అలవాటు బొత్తిగా లేదు.

ఆరడుగుల విగ్రహం! ఎరుపురంగు, మేని ఛాయ, ఉంగరాల జుత్తు, లాల్చీ పంచలో హనుమాన్లు ధగ ధగ మెరిసి పోతూంటాడు.

హనుమాన్లు అంటేనే క్రమశిక్షణకు మరొకపేరు. చేతిలో బెత్తంతో స్కూలు ప్రాంగణంలో నిలబడితే చాలు.. విద్యార్థులకు ఇటు టీచర్లకు హడలే!

ప్రేయర్ వేళకి ఎవరైనా రాకపోతే... వాళ్ళని ఎండలో అర్థగంటసేపు నిలబెట్టి శిక్షిస్తాడు.

ఎవరికీ తలవంచిన వ్యక్తిత్వం కల మనిషి. ఈయన పని చేసే స్కూలుకి డి.ఇ.ఓ. సైతం ఇన్స్పెక్షన్‌కురాడు. ఏటా టెన్త్ రిజల్ట్సులో సెంట్ పర్సెంట్ ఉత్తీర్ణతే అందుకు కారణం.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా... ప్రధానోపాధ్యాయుడిగా బహుమతులు అందకున్న ఆదర్శ మూర్తి. ఎందరో టీచర్లకు మార్గదర్శకుడు!

తన సర్వీసంతా స్కూలు విద్యార్థులకే అంకితం చేసాడు.

అటువంటి ఆయన మరో రెండేళ్లలో పదవీ విరమణ చేస్తాడనగ... పిట్టలవారి పాలెం.. మారుమూల చోటికి బదిలీ చేయటం జరిగినా.. ఎవరి సహాయము అర్థించలేదు. ఎవరి కాళ్ల మీద పడలేదు. రికమెండేషన్ కోసం వెంపర్లాడలేదు.

ఆయన సర్వీసులో ఎన్నో వూళ్లు తిరిగాడు. ఎన్నో చోట్ల పని చేశాడు. ఎక్కడికెళ్లినా ఆయనకు అందరూ నీరాజనాలు పట్టారు. గౌరవించారు. పొగడ్తలతో ముంచెత్తేవారు.

ఉపాధ్యాయుడిగ తన పనేమిటో తానేమిటో తప్పించి వూళ్లో రాజకీయాల జోలికి పోయే తత్వం కాదు ఆయనది. స్నేహితులెవరూ లేరు ఆయనకు!

తమ పిల్లలకి ట్యూషన్ చెప్పమని గ్రామస్తులు ప్రాధేయపడినా ససేమిరా వప్పుకునేవాడు కాదు. స్కూల్లో టీచర్లు పాఠాలు ఖచ్చితంగా చెప్తున్నప్పుడు పిల్లలను ప్రైవేటుకి పంపడం దేనికని ప్రశ్నిస్తాడు. జీతం తీసుకున్న ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలనేది హనుమాన్లు సిద్ధాంతం.

★★★★★

పిట్టల వారి పాలెంలో సర్పంచ్ రామిరెడ్డి అంటే అందరికీ హడల్. ఈయన మాటకి ఎదురు చెప్పగల ధైర్యం ఎవరికీ లేదు. రామిరెడ్డి ఏ విషయంలోనైనా ఎంత చెబితే అంత! ఎంతటివాడైనా తన ముందు చేతులుకట్టుకుని తలదించుకుని నిలబడవలసిందే! అందుకు భిన్నంగా ప్రవర్తిస్తే తన తఢాకా ఏమిటో రుచి చూపిస్తాడు. రాజకీయాల్లో మంచి పలుకుబడి కలిగినవాడు రామిరెడ్డి.

ఊరికి కొత్తగా బదిలీ మీద వచ్చిన హెడ్‌మాస్టరు హనుమాన్లు డ్యూటీలో చేరి రెండు నెలలైనా వచ్చి తనని కల్సుకోక పోవటం చూసి మండిపడ్డాడు రామిరెడ్డి!

వచ్చితనను కల్సు కోమంటూ కబురంపేడు. అయినా హనుమాన్లు వచ్చి రామిరెడ్డి దర్శనం చేసుకోకపోవటంతో తొక తొక్కిన త్రాచే అయినాడు. ముసలోడికి ఇంత పొగరా? అని పళ్లు కొరికాడు.

సర్పంచ్ దేవాంతకుడని... కొరకరాని కొయ్య అని ఆనోటా, ఈ నోట విని నప్పటికీ రామిరెడ్డి రాజకీయ పలుకుబడికి లొంగి దాసోహం అన తల్చుకోలేదు హనుమాన్లు.

తనపని తాను ఖచ్చితంగా చేసుకుపోతున్నప్పుడు... తానెవరికీ వెరవతల్చుకోలేదు.. అంత ఖచ్చితమైన మనిషి తను!

హనుమాన్లని ఎలా లొంగ దీసుకోవటమాని తీవ్రంగా యోచిస్తున్నాడు రామిరెడ్డి. హెడ్మాస్టర్ గతం ఏమిటో.. ఎలాంటి వాడో... మొదలైన విషయాలన్నీ తన మనుషుల ద్వారా సేకరించాడు... ఆయ్యోరి సంగతేందో ఓ పట్టు పట్టి చూడాల్సిందే ననుకున్నాడు.

ఆరోజు ఆదివారం కావటంతో స్కూలుకి వెళ్లవలసిన అవసరం లేకపోవటంతో పంచలో నున్న వాలు కుర్చీలో పడుకుని 'న్యూస్‌పేపర్' తిరగేస్తున్నాడు హనుమాన్లు.

నమస్కారం అయ్యా... అంటూ వచ్చిన రాములమ్మ ముఖంలోకి తేరిపార చూసాడు.

'నువ్వు ఇంటి కెందుకొచ్చావ్? ఇక్కడ నీకేం పని...? ఏదైనా మాట్లాడాలనుకుంటె స్కూలుకి వచ్చి మాట్లాడు..వెళ్లు... కసిరినట్టే అన్నాడు.

ఊహకు అందని విధంగా రాములమ్మ గభాలున హనుమాన్ల పాదాల మీద పడి కళ్ల నీళ్ళు పెట్టుకుంది.

కూర్చున్న వాడల్లా చివాలున కుర్చీలోంచి లేచి 'ఏయ్... ఏమిటిది? కాళ్ల మీద పడటం

నాకు నచ్చదు..'' అంటూ దూరం జరిగేడు.

'అయ్యా... తమరే నన్ను కాపాడాలి... బీద దాన్ని... పైటతో కళ్ళొత్తుకుంటూ అంది.

'చూడు.. నేనీవూరికి కొత్తగా వచ్చిన వాడిని. నాకిక్కడ ఎవరూ తెలియదు. నాకు ఎవరితోనూ పరిచయాల్లేవు. నేను నీకు ఎలాంటి సాయమూ చేయలేను... ' కొంచెం కటువుగా మట్లాడాడు.

'తమరు దేవుడి లాంటోరు... అట్లా అంటే కాదు. నాకు మరో దారి లేదు...

'సర్లే... ఏడుపు మాని... అసలు విషయం ఏమిటో చెప్పు... నాకు అవతల ఇంట్లో చేసుకోవలసిన పని బోలెడుంది.... ' తొందర చేశాడు.

'తమరికి తెలవదా సార్. నేను నిప్పులాంటి దాన్ని. సర్పంచ్ దొర నన్ను నానామాటలు అంటున్నాడు. మీకు నాకు రంకు అంటగట్టాలని సూత్తావున్నాడు.'

రాములమ్మ మాటలకు నివ్వెర పోయాడు. ఇదెక్కడి అన్యాయం? ఆమె వయసులో వున్న తల చెడిన ఆడది. స్కూల్లో అటెండర్ వుద్యోగం చేస్తున్నంత మాత్రాన తనకు రాములమ్మకు మధ్య అక్రమ సంబంధం అంటగడతాడా ఆ రామిరెడ్డి? అతను మనిషా పశువా..; ఇదంతా కావాలని ఆడుతున్నడ్రామా అన్పించింది. తన మీద కక్షతో తనను అప్రతిష్ఠపాలు చేయాలని చేస్తున్న దుష్ప్రచారం... తాను వెళ్లి అతగాడిని కలువలేదని ఇంతటి నింద తనపై మోపు తాడా?... అభం శుభం తెలీని రాములమ్మపై అభాండం వేస్తాడా?...

'అయ్యా... బీద ముండని... నన్ను మీరే ఈ ఆపద నుంచి కాపాడాలి...'

'నరేలే.. ఏడవకు...నువ్వేం భయపడకు...వెళ్లు!- నువ్వింటి కెళ్లు...మళ్లీ... ఎప్పుడూ నా ఇంటి గడప తొక్కొద్దు... ఎలాగో సర్దిచెప్పి రాములమ్మని పంపించేశాడు హనుమాన్లు.

★★★★★

రాములమ్మకి పదో ఏటనే పెళ్లయింది. ఊహ తెలియని రోజుల్లో తనను బావకిచ్చి చేసారు.తనకేమో చదువు కోవాలని వుండేది. ఇంట్లో పెద్ద వాళ్లు చదువు మానుకోమని చెప్తున్నా... బావ తనను చదువుకోమని ప్రోత్సహించటంతో హైస్కూల్లో టెన్త్ వరకు చదివింది. పదవ తరగతి ఫెయిలైన కారణంగా చదువు మానెయ్యాల్సి వచ్చింది.

నిండు నూరేళ్లు భర్తతో సుఖంగా కాపురం చేయాల్సిన రాములమ్మ బతుకులో పాతికేళ్లయినా నిండకుండానే నిప్పులుపోసాడా దేవుడు.

చిన్న వయసులోనే వైధవ్యం ప్రాప్తించినందుకు గుండెలుబాదుకుంది.

రాములమ్మ వంటరిదైంది. కాయకష్టం చేసుకు బతకటం ఇష్టం లేక పోవటంతో ఏదైనా వుద్యోగం దొరికితే చేయాలని తాపత్రయపడింది!

సరిగ్గా ఆ సమయంలోనే రాములమ్మ సర్పంచ్ రామిరెడ్డి కాళ్ల మీద పడిసాయంకోరింది.

తనను ఆదుకోమని బోరున ఏడ్చింది.

భర్తను పోగొట్టుకున్న ఆడది కదాని జాలితో... కొన్నాళ్లు తన చుట్టూ తిప్పుకున్న రామిరెడ్డి చివరికి జిల్లా పరిషత్ హైస్కూల్లో అటెండర్ వుద్యోగం ఇప్పించి పుణ్యం కట్టుకున్నాడు.

ప్రతిఫలాపేక్ష తోనే రాములమ్మకు ఆ వుద్యోగం ఇప్పించాడనే నిజం ఆమెకు తర్వాత గానీ తెలిసి రాలేదు.

చిరుత పులి పంజా లాంటి రామిరెడ్డి కబంధ హస్తాలకు చిక్కకుండా అనేక సార్లు రాములమ్మ తప్పించుకోగలిగింది. అయినా అవకాశం దొరికినపుడల్లా 'హంట్' చేస్తూనే వున్నాడు. రాములమ్మ తనకు తప్ప ఇతరులెవ్వరికీ దక్కకూడదు. అందీ అందని రాములమ్మ కోసం నిరీక్షిస్తూనే వున్నాడు.

వంటరి తనంతో బ్రతకలేక పోతున్న రాములమ్మ తనను తాన రక్షించుకోవటం కోసం నుదుట బొట్టు పెట్టుకోవటం అలవాటు చేసుకుంది. తల్లో పూలు పెట్టుకుంటోంది. మంచి సబ్బుతో స్నానం చేస్తుంది. సెంటు పూసుకుంటుంది. బొడ్డు కిందికి చీరె కడుతుంది. తను చదువుకున్న మహిళ కావటంతో మోడ్రన్‌గా వుండాలని తాపత్రయపడుతుంది.

ఒక్క సర్పంచ్ రామిరెడ్డే కాదు... స్కూల్లో పంతుళ్ళు, వూళ్లో కుర్రాళ్లకి రాములమ్మ మీదే కన్ను.

కానీ ఏ మగాడికీ తన మనసులో పిసరంతైన చోటు ఇవ్వకుండా అందరినీ ఆటపట్టిస్తూ ఏడిపిస్తూనే వుంటోంది తనను తాను ఎల్ల వేళలా రక్షించుకుంటూనే వుంటోంది.

రాములమ్మ కొత్తగా వుద్యోగంలో చేరినప్పుడు డి.ఇ.ఓ. ఇన్స్పెక్షన్‌కొచ్చాడు.

ఆయనకు హోటల్ తిండిపెట్టించటం ఇష్టంలేని సర్పంచ్ రాములమ్మని పిలిచి డి.ఇ.ఓ.కి బిర్యానీ చేసి గెస్ట్‌హౌస్‌కు కెరియర్లో తీసుకెళ్లి ఇచ్చి రమ్మని ఆర్డరేసాడు.

కాదన్లేక కోడిని కోసి స్పెషల్‌గా బిర్యానీ చేసి కేరియర్‌ను పట్టుకుని రాత్రి ఎనిమిది గంటల సమయంలో బంగళా చేరుకుంది.

'నువ్వా రాములమ్మా... ఏమిటి ఇట్లా వచ్చావ్? ప్రశ్నించాడు డి.ఇ.ఓ.

'సర్పంచ్ సారు మీకు భోజనం ఇచ్చి రమ్మన్నారు సార్... పట్టు కొచ్చినా...' కెరియర్ టీ పాయ్ మీద వుంచింది'

'అందులోవున్నది సాంబారు భోజనమేనా..;- అడిగేడు.

'లేదండయ్యా..కోడి బిర్యానీ నేనే సాయంగా వండి వేడి వేడిగా తెచ్చాను తమరి కోసం'

అప్పటికే మందు మత్తులో వున్న డి.ఇ.ఓ. రాములమ్మను చూచి ఆశపడ్డాడు.

'ఇంతందమైన నువ్వు ఆఫ్ట్రాల్ అటెండర్ వుద్యోగం చేయటమా?-నాన్సెన్స్!! నీకు గుమాస్తా

వుద్యోగం ఇస్తాను.. సంతోషమేనే?--' ట్రాప్ చేయాలనిమాట్లాడాడు.

నిజంగా తనకు గుమాస్తా వుద్యోగం ఇస్తాడా? ఇస్తే ఎంత హాయిగా వుంటుంది. జీతం పెరుగుతుంది... ఎంచక్కా కుర్చీలో కూర్చుని జాబ్ చేయచ్చు! అందరూ తనను గౌరవిస్తారు.. ఆ క్షణంలో రాములమ్మలో ఎన్నెన్నో ఆలోచనలు..

'ఏం మాట్లాడవ్? నువ్ యస్సన్నావంటే.... నే రెడీ... గ్లాసులో మిగిలిన మందు గొంతులో పోసుకున్న డి.ఇ.వో. రెండడుగులు ముందు కేసి రాములమ్మ చెయ్యి పట్టుకుని ఆమెను మీదకు లాక్కున్నాడు.

డి.ఇ.ఓ. చర్యకి బెదిరి పోయింది రాములమ్మ! అతని దుర్బుద్ధి అర్థమైంది! చేయి విడిపించుకుని దూరంగా జరిగింది.

'సార్... మీరు పెద్దోళ్లు.. గొప్పోళ్లు... తప్పుసార్... వద్దు మీకిది తగదు..." వెళ్ళ బోయింది.

రాములమ్మ కొంగు అంది పుచ్చుకున్నాడు... ఆ క్షణంలో డి.ఇ.ఓ. దుశ్శాసనుడే అయినాడు.

'ఎంగిలి కూటికి ఆశపడకండి సారూ... 'పైట కొంగు వెనక్కు లాక్కుంది.

'ఇక అక్కడే వుంటే ఏం అనర్థం జరుగుతుందోననే భయంతో వడి వడిగా బంగళాలోంచి బైటపడి రోడ్డెక్కింది రాములమ్మ.

★★★★★

తాను సస్పెన్షన్‌లో వున్నా హనుమాన్లు ఛార్జి ఎవరికి అప్పగించని కారణాన రోజు స్కూల్‌కు ఠంచనుగా వెళ్లి తన డ్యూటీ తాను చేసుకుపోతున్నాడు. ఆ విధంగా చేస్తున్న తనను ఎవరుఅడ్డుకోక పోవటం చూస్తూ ఇదీ ఒకందుకు మంచిదేననే భావనలో వున్నాడు.

రాములమ్మకు తనకు మధ్య తలెత్తిన పుకార్లను .... అపనిందని లక్ష్య పెట్టటం లేదు.

"సారూ .... సారూ... ఈ ఘోరం మీరు చూశారా...' పరుగు పరుగున హెడ్మాస్టర్ గదిలో కొచ్చి రొప్పుతూ ఆయాస పడుతూ అంది రాములమ్మ.

'ఏమైంది? ఎందుకా కంగారు? - విషయం ఏమిటో నింపాదిగా చెప్పు రాములమ్మా..' ఆమె ముఖ కవళికలు గమనిస్తూ అడిగాడు హనుమాన్లు.

"సారూ!... ఈ సర్పంచ్‌గారు మనలను బతకనీయ తల్చుకోలేదు..'

'విషయం చెప్పకుండా ఏదేదో మాట్లాడతావేం?

'అయితే ఈవిషయం మీదాకా రాలేదన్నమాట..

'ఏ విషయం?'

'ఏం చెప్పమంటారుసార్....? స్కూలు ప్రహారీ గోడల నిండా...మనిద్దరి మధ్య వున్న అక్రమ సంబంధం గురించి పిచ్చి పిచ్చి రాతలు రాసారు. డ్యూటీకి రావాలంటేనే సిగ్గుతో చచ్చిపోతున్నానయ్యా..." వలవలా ఏడ్చింది.

"ఈ లోకం తీరే అంత రాములమ్మా! ఇతరులను గౌరవంగా బ్రతకనీయరు. కళ్లలో నిప్పులు పోసుకుంటారు... నువ్వేం బాధపడకు! ఆడ దానివి కదా... అవమానాన్ని భరించటం కష్టమే..." ఓదార్చబోయాడు.

' పాపిష్టి బతుకు నాకద్దుసార్..నాకు చచ్చిపోవాలనుంది"

'నీవు నేను ఇద్దరం వంటరి వాళ్లమే చచ్చిపోయినా ఎవరికీ బాధ వుండదు. ఈ సమస్యకు పరిష్కార మార్గం ఆలోచిస్తాను. నువ్వు బాధపడకు...వెళ్లు! వెళ్లి నీపని చూసుకో..!

అడుగులో అడుగేసుకుంటూ గదిలోంచి బైటికొచ్చేసింది రాములమ్మ.

హనుమాన్లు ఈషణ్మాత్రమైనా ఆందోళనకు గురి కావటం లేదు. మనిషి నిర్భయంగ నిశ్చలంగ వున్నాడు.

★★★★★

ఉదయం ఎనిమిది గంటల సమయాన స్కూలు స్వీపరు యాదయ్య పరుగెత్తుకుంటూ సర్పంచ్ ఇల్లు చేరుకున్నాడు.

'దొరా... దొరా... మరే... మరే...'వేప పుల్లతో పళ్లు తోము కుంటున్న రామ రెడ్డిని చూస్తూ ఏదో చెప్ప బోయినవాడు రొప్పుతూ ఆగాడు.

'ఏందిరా ఎదవనాయాల... ఏం కొంప మునిగిందని ఉదయాన్నే వచ్చావ్'?

'సారూ..నేను రోజుకుమల్లే పొద్దుటే చిమ్ముదామని స్కూలు కాడికెల్లి నానండి. పెద్ద సార్ గది తలుపులు తెరిచి వుండటంతో లోని కెళ్లి చూద్దును కదా...

"ఏం చూశావో చెప్పు"

"హెడ్ మాస్టర్ గారు... రాములమ్మ సచ్చి పడివున్నారండి... నాకు భయమేసి మీకాడకి లగెత్తుకొచ్చినా...'

'నిజమా' నిర్ఘాంత పోయాడు.

'సత్తెపెమానకంగా సారూ...'

'సరే...నువ్వెళ్లి స్కూలు దగ్గరే వుండు. నేను పోలీస్ ఇన్స్పెక్టర్ని వెంట తీసుకుని అక్కడి కొస్తా...పో...!

సుగ్రీవాజ్ఞగా భావించిన యాదయ్య వెను తిరిగి వెళ్లిపోయాడు.

మరో అరగంటలో ఎస్సై.. సర్పంచ్ రామిరెడ్డీ స్కూలు చేరుకున్నారు.

'మీరన్నట్టు వాళ్లిద్దరూ ఏకంగా స్కూల్లో కాపురం పెట్టేశారా ఏంటి?-- నడుస్తూ ఎస్సై వెంట వున్న రామిరెడ్డితో అన్నాడు.

'హనుమాన్లు తక్కువ వాడేం కాదు..బరితెగించి అంతపనీ చేసి వుంటాడు... రండి...' వాళ్లిద్దరి మీద మనసులో వున్న అక్కసు కొద్దీ మాట్లాడాడు రామిరెడ్డి.

గదిలోపడి వున్న రెండు శవాలను చూచి విస్తు పోయారిద్దరూ!

'అసలు వీళ్లెందుకు చచ్చిపోయినట్టు? పైగా జాయింట్‌గా కూడ బలుక్కుని మరీ ఒక గదిలో చచ్చారంటే... ఇందులోఏదో కిటుకు వుండే వుంటుంది..'పక్క నున్న ఎస్సైతో అన్నాడు రామిరెడ్డి.

'ఇద్దరి మెడలో ఒకే పూలదండ వుంది. చూడండి! అంటే... గాంధర్వ వివాహం చేసుకుని మరీ ప్రాణాలు తీసుకున్నారన్నమాట" ఎస్సై మాటల్లో వెటకారం ధ్వనించింది.

"ఎస్సై గారూ... ఆ బోర్డు మీద ఏదో రాసిపెట్టి మరీ చచ్చారు. అదేందో కాస్త చదవండి వింటాను..."

మా మధ్య అక్రమ సంబంధం వుందని పుకార్లు పుట్టించినవాళ్ల నోళ్లు మూయించటానికే మేం ఆఖరి క్షణాల్లో భార్య భర్తలమైనట్టు గుర్తుగాఒకే పూలదండ మా ఇద్దరి మెళ్లో వేసుకుని... పవిత్రమైన మనసులతో విషం తాగాము... ఇదినిజం!! దేవుడెరిగిన నిజం...! ఈ నిజం విమర్శించిన వారి అందరి అంతరాత్మలకూ తెలుసు! అపనిందలు మోస్తూ... అవమానాలు భరిస్తూ.. బ్రతకటం అనవసరమని అన్పించే మేమీనిర్ణయం తీసుకున్నాం.

'నే చదివింది విన్నారుగా రెడ్డిగారు...అదీ విషయం..' అంటూ నిట్టూర్చిన ఎస్సై శవాలను పోస్ట్ మార్టమ్‌కి పంపే ప్రయత్నంలో నిమగ్నమైనాడు.

ఇలాంటి నిర్ణయం వారిరువురూ తీసుకుంటారని వూహించలేని సర్పంచ్ రామిరెడ్డి తెల్ల మొహం వేశాడు.

-:(సమాప్తం):-